సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ‌। 22 । జనవరి । 2025



సోమశిలలో 69.128 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 69.128 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1890 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.81,750
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,447
3శాతం జీఎస్టీతో	రూ.7,670
సవర (8గ్రా)	రూ.61,360

గరిష్టం/కనిష్టం
30.7 /21.2

వాతావరణం

బుధవారం జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 51 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పక్కాగా పింఛన్ల పరిశీలన

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన పక్కాగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో దివ్యాంగుల పింఛన్ల పరిశీలనపై నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 32 వేలకు పైగా దివ్యాంగుల పింఛనర్లు ఉన్నాయన్నారు. పరిశీలనకు పక్కా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలన ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన నివేదికలను ప్రభుత్వానికి అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖాధికారులు, జీజీహెచ్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా వంశీధర్‌రెడ్డి



వంశీధర్‌రెడ్డితో నేతలు

నెల్లూరు రూరల్: బీజేపీ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర సంస్థాగత ఎన్నికల అధికారి వల్లూరు జయప్రకాష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నా శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజాసేవకు ఇది తన రెండో ఇన్నింగ్ అని, ప్రతి కార్యకర్త, నాయకులతో కలిసి పార్టీ శ్రేయస్సు కోసం సమష్టిగా పనిచేస్తానని తెలిపారు. సమావేశం అనంతరం నాయకులు, కార్యకర్తలు వంశీధర్‌రెడ్డిని పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయం నుండి వీఆర్‌సీ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రగోళ్ల గోపి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని దుకాణాలకు జరిమానా



ఆక్వా దుకాణంలో తనిఖీలు చేస్తున్న మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు

నెల్లూరు (సెంట్రల్): ఆక్వా సాగులో నిషేధిత బయో కెమికల్స్, యాంటీబయోటిక్స్ విక్రయిస్తున్న పలు షాపులకు మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు జరిమానా విధించారు. నెల్లూరులోని సాయిరాం ఆక్వా ఫీడ్స్, ఓషనేరియస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ మహదేవ్ ఎంటర్‌ప్రైజెస్ ఆక్వా షాపుల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ షాపులు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ అనుమతులు పొందకుండా విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. వీటికి రూ.25 వేలు వంతున జరిమానా విధించామన్నారు. అనుమతులు లేకుండా ఆక్వా సాగుకు సంబంధించి యాంటీ బయోటిక్స్ విక్రయాలు చేస్తే చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్వా అనుబంధ యూనిట్లకు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు ఉండాలని, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతి పొందిన ఆక్వా ఉత్పత్తులు మాత్రమే విక్రయాలు చేయాలని సూచించారు. తనిఖీల్లో మత్స్యశాఖాధికారులు కీర్తి పవిత్ర, శ్రీనివాసులు, సంజయ్ స్టీఫెన్ పాల్గొన్నారు.

24వ తేదీలోపు అభ్యంతరాలు తెలపాలి

నెల్లూరు (అర్బన్): జిల్లాలోని భూములు, ఇళ్ల స్థలాల విలువల్లో మార్పుల ప్రతిపాదనలపై అభ్యంతరాలుంటే ఈ నెల 24వ తేదీ వరకు అవకాశం కల్పించామని జేసీ కార్తీక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో సంబంధిత రిజిస్ట్రేషన్, తహసీల్దార్, మండల పరిషత్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఉన్న నోటీసు బోర్డుల్లో ఉంచామన్నారు. ప్రజలకు ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు స్వయంగా గాని, పోస్ట్ ద్వారా గాని, ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్ ద్వారా గాని తెలపాలని కోరారు.

పెన్నమ్మ శోకిస్తోంది. అయినా జిల్లా అధికార యంత్రాంగానికి వినపడడం లేదు.. కనపడడం లేదు. ధనార్జనే ధ్యేయంగా టీడీపీ నేతలు అక్రమంగా సాగిస్తున్న ఇసుక తవ్వకాలతో భవిష్యత్‌లో ప్రమాద ఘంటికలకు కారణంగా మారబోతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా కోవూరుకు చెందిన ఓ టీడీపీ నేత స్వార్థానికి నెల్లూరు పరిధిలో పెన్నానదిపై నిర్మించిన కొత్త, పాత వంతెనలతోపాటు నెల్లూరు బ్యారేజీ భద్రత గాలిలో దీపంలా మారనుందని విస్పష్టం చేస్తున్నారు. పోతిరెడ్డిపాళెం వద్ద రేయింబవళ్లు భారీ యంత్రాలు పెట్టి ఇసుక తోడేస్తున్నారు. గత ప్రభుత్వంలో మినగల్లు రీచ్‌లో నిల్వ చేసిన ఇసుకను అధికారుల సాక్షిగా రవాణా చేసినా నోరుమెదపక పోవడం విశేషం. జరగబోయే పెను ఉపద్రవాలకు జిల్లా అధికార యంత్రాంగంతోపాటు స్థానిక ప్రజాప్రతినిధి బాధ్యత వహించాల్సి ఉంటుంది.



పోతిరెడ్డిపాళెం వద్ద పెన్నా నదిలో భారీ యంత్రాలతో ఇసుక లోడింగ్

పెన్నాకు గర్భశోకం

20 అడుగుల మేర ఇసుక తోడేస్తున్న టీడీపీ తోడేలు



పెన్నా పొర్లుకట్టకు గండికొట్టి వెళ్తున్న భారీ వాహనాలు

- అనుమతుల్లేకుండానే పల్లిపాడు రీచ్‌లో తవ్వకాలు
- పోతిరెడ్డిపాళెం వద్ద పెన్నా పొర్లుకట్టలు ధ్వంసం
- రేయింబవళ్లు భారీ యంత్రాలు పెట్టి ఇసుక రవాణా
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఇసుక లోడింగ్‌కు బారులు తీరిన వాహనాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోవూరు నియోజకవర్గంలో అవినీతి రహిత పాలన కొనసాగిస్తాం.. ఎక్కడ అవినీతి జరిగినా సహించను.. వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం..' అంటూ స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తరచూ చెబుతున్నారు. సీన్ కట్‌చేస్తే కోవూరు నియోజకవర్గం ఇసుక దోపిడీకి అడ్డగా మారిపోయింది. ఆ పార్టీలో కీలక నేతగా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తి పెన్నా నదీ గర్భాన్ని తోడేస్తున్నాడు. పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాడు. ఈ దోపిడీ బహిరంగంగా జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. నెలవారీ మామూళ్ల మత్తులో పెన్నమ్మ గర్భశోకాన్ని పట్టించుకోవడం లేదు.

యంత్రాలు పెట్టి..

జిల్లాలో మూడు డిసిల్టేషన్ పాయింట్లతోపాటు రెండు ఓపెన్ రీచ్‌లకు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు అనుమతులిచ్చారు. పర్యావరణ అనుమతులు లేనందున నదుల్లో యంత్రాల ద్వారా ఇసుక లోడింగ్ విధానానికి అనుమతులు రాలేదు. సంగం, పోతిరెడ్డిపాళెం, సూరాయపాళెం డీసిల్టేషన్ పాయింట్ల దగ్గర నుంచి స్టాక్ పాయింట్ వద్దకు తెచ్చిన ఇసుకను లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. టన్నుకు రూ.250 వరకు ఖర్చవుతోంది. తాజాగా ఓపెన్ రీచ్‌ల్లో సెమీ మెకనైజ్డ్ పేరుతో తవ్వకాలు, యంత్రాలకు అనుమతులు ఇవ్వగా అదే అదనుగా భావించిన కొందరు భారీ యంత్రాలతో పెన్నా నదిని తోడేస్తూ ఇసుక దోపిడీకి తెగబడుతున్నారు.

ఆయన కనుసన్నల్లోనే..

కోవూరు నియోజకవర్గంలోని పల్లిపాడు ఓపెన్ రీచ్, పోతిరెడ్డిపాళెం డీసిల్టేషన్ పాయింట్‌ను స్థానిక ప్రజాప్రతినిధి సమీప బంధువైన ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. ఇతరులు వేలు పెట్టకుండా అంతా ఆయన కనుసన్నల్లోనే ఇసుక దందా నడుస్తోంది. తొలుత పోతిరెడ్డిపాళెం డీసిల్టేషన్ పాయింట్‌ను హస్తగతం చేసుకున్న సదరు కాంట్రాక్టర్ నేరుగా పెద్ద లారీలు, టిప్పర్లను రీచ్‌లోకి తీసుకెళ్లి లోడింగ్ చేయిస్తున్నారు. ఒక వాహనం లోడింగ్ కోసం రూ.8 వేలు వంతు వసూలు చేసుకుంటున్నారు. నిత్యం వంద వాహనాలకు పైగా లోడింగ్ ప్రక్రియ జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా నది నుంచి డీసిల్టేషన్ పాయింట్ వద్దకు ట్రాక్టర్లతో రవాణా చేసి అక్కడ నుంచే పెద్ద వాహనాలకు లోడింగ్ చేయాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా పెన్నానది నుంచే లోడింగ్ చేస్తున్నారు. పొర్లుకట్టలు ధ్వంసం చేసి రవాణా సాగిస్తున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో పెన్నా వరద ముప్పు ముంచేసే అవకాశం ఉందని స్థానిక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

12 వేల ఎంటీ ఇసుక మాయంపై మౌనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల వ్యవధిలోనే సదరు కాంట్రాక్టర్ మినగల్లు రీచ్ సమీపంలోని స్టాక్ పాయింట్‌లో 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను మాయం చేసినట్లుగా అధికారులే గుర్తించారు. కానీ ఇప్పటి వరకు మాయమైన ఇసుకకు సంబంధించిన నగదు రాబట్టడంలో మీనమేషాలు లెక్కిస్తున్న గనులశాఖ, ఆ మాయమైన ఇసుక రవాణా చేసినందుకు దాదాపు రూ.20 లక్షల వరకు ఇచ్చినట్లు సమాచారం.

పల్లిపాడులో దోపిడీ ఇలా..

పల్లిపాడు ఓపెన్ రీచ్‌లో సదరు కాంట్రాక్టర్ దోపిడీ పర్వం మామూలుగా లేదు. ఆ రీచ్‌లో టన్ను ఇసుక లోడింగ్ చార్జీలకు రూ.52 తీసుకుంటామని టెండర్ దక్కించుకున్న ఆయన చిన్న యంత్రాలకు బదులు పెద్ద హీటాచీ వంటి యంత్రాలు ఉపయోగిస్తున్నాడు. భారీ యంత్రాల ద్వారా టిప్పర్లు, పెద్ద వాహనాలకు లోడింగ్ చేస్తూ ఖర్చుల కింద రూ.8 వేలు వంతున వసూలు చేస్తున్నట్లు సమాచారం.

- సెమీ మెకనైజ్డ్ అంటే జేసీబీ వంటి యంత్రానికి ముందు ఉండే బకెట్ (హుక్)తో ఒకసారి 0.6 క్యూబిక్ మీటర్లు (దాదాపు ఒక టన్ను) ఇసుక తీయాల్సి ఉంది. పల్లెపాడు రీచ్‌లో 4 టన్నుల వరకు తీస్తున్నారు.
- టిప్పర్‌కు 18 టన్నులు లోడ్ చేస్తున్నట్లు రికార్డుల్లో రాసుకుని దాదాపు 38 టన్నులు ఎత్తుతున్నారు.
- నిబంధనల ప్రకారం లోడింగ్‌కు రూ.1,050 తీసుకోవాల్సి ఉండగా, రూ.8 వేలు వసూలు చేస్తున్నారు. రీచ్ పరిధిలో ఎక్కడా సీసీ కెమెరాలు లేవు.



పల్లిపాడు రీచ్‌లో భారీ యంత్రంతో ఇసుక లోడింగ్

ఉపాధి పనుల్లో అవినీతిని సహించం

- మార్చి చివరి నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలి
- పీడీ గంగాభవాని



స్త్రీశక్తి భవనంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ గంగాభవాని

ఉదయగిరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిబ్బందితో పాటు మేట్‌లు, క్షేత్ర సహాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ కె.గంగాభవాని హెచ్చరించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం ఉదయగిరి క్లస్టర్‌లోని 8 మండలాల ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్ తనిఖీల్లో ఉద్యోగులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు వెలుగు చూడడంతో వారిపై చట్టపరంగా కేసులు కూడా పెడుతున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ కనీస వేతనానికి తగిన పని కల్పించాలన్నారు. మెటీరియల్ పనులకు సంబంధించి నిధులు పెరగాలంటే ఉపాధి కూలీల సంఖ్య కూడా బాగా పెంచాలన్నారు. ముఖ్యంగా ఉదయగిరి మెట్ట ప్రాంతాల్లో పనులు నిర్వహించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నందున కేటాయించిన లక్ష్యం మేరకు కూలీలకు పని కల్పించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. జాబ్‌కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు తప్పని సరిగా పని కల్పించాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పలు మండలాల్లో నిర్దేశించిన లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నారని, వారి తీరు మారకపోతే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఉదయగిరి ఏపీడీ గాయత్రీదేవి, ఏపీఓలు, ఈసీలు, టీఏలు, ఎఫ్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉదయగిరిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు.

డబ్బు కోసం కన్నబిడ్డల అమ్మకం

- మినగల్లులో ఘటన

బుచ్చిరెడ్డిపాళెం : ఏ పనిచేయకుండా అల్ప సంపాదనతో జీవనం సాగించవచ్చన్న ఉద్దేశంతో కన్నబిడ్డలను అమ్మకాలు చేస్తున్న ఓ కసాయి దంపతుల వ్యవహారం మంగళవారం వెలుగులోకి వచ్చింది. బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన రవి, వెంకమ్మలకు ముగ్గురు సంతానం. వారిలో మొదటి బిడ్డను ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన వారికి విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు. రవి తన ఏడేళ్ల వయసున్న రెండో కుమారుడిని తీసుకుని ఇటీవల హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో వెళ్లిపోయాడు. దీనిపై పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వెంకమ్మను ఆరా తీయగా వారు తమకు ఇక్కడ డబ్బులు ఇవ్వలేదని హైదరాబాద్‌లో రూ.లక్ష ఇస్తామని చెప్పి నా భర్తను, బిడ్డను తీసుకెళ్లినట్టు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాకేమీ తెలియదు



నా భర్త పిల్లలను ఎవరికి విక్రయిస్తున్నారో నాకు తెలియదు. ఆదివారం వచ్చిన ఓ వ్యక్తి పిల్లవాడిని తీసుకుని లక్ష రూపాయలను రవి చేత పంపిస్తానని చెప్పారు. ఇక్కడ మాత్రం నాకు డబ్బులు ఇవ్వలేదు. – వెంకమ్మ

రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యం



రోడ్డు భద్రతపై ఫ్లెక్సీలను ఆవిష్కరించిన కలెక్టర్, అధికారులు

నెల్లూరు(అర్బన్): రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా రోడ్డు భద్రతా కమిటీలోని అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ నినాదాలతో రూపొందించిన ఫ్లెక్సీలను మున్సిపల్ కమిషనర్ సూర్యతేజతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా పోలీసులు, రవాణా శాఖాధికారులు పని చేయాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ శాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, డీటీసీ చందర్, ఆర్‌టీఓలు శ్రీచందన, సుధాకర్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ చౌదరి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్ వలీ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఎస్‌ఈలు గంగాధరం, అశోక్‌కుమార్, రామ్మోహన్, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్ పరీక్ష

- హాజరుకానున్న 10 వేల మందికి పైగా విద్యార్థులు

నెల్లూరు (టౌన్): ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించనున్న జేఈఈ మెయిన్ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం నుంచి 24 వరకు, 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రెండు విడతల్లో పరీక్ష నిర్వహించనున్నారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, పొట్టేపాలెంలోని ఇయాన్ డిజిటల్ సెంటరు, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పరీక్షను నిర్వహించారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు, మళ్లీ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష జరగనుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యుత్తు, ఇంటర్నెట్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఎన్టీయే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన సెల్ఫ్ డిక్లరేషన్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఒరిజనల్ గుర్తింపు కార్డు, బాల్‌పాయింట్ పెన్ను, దివ్యాంగులైతే సంబంధిత అధికారి జారీ చేసిన సర్టిఫికెట్‌ను తప్పని సరిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రంలోకి కాలుక్యులేటర్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, వాచ్‌లు, సెల్‌ఫోన్ తదితర వాటిని అనుమతించరు.

విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కనే డీఈఓ తదితరులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం విడుదల చేసిన 117 జీఓకు అనుగుణంగా పాఠశాలల పునర్నిర్మాణం, బోధనా సిబ్బంది పునర్విభజన కోసం విద్యాశాఖాధికారులు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో విద్యాశాఖాధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలు ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ నూతన విధానానికి గ్రామ స్థాయిలో ప్రజలను సమన్వయపరిచి వారి మద్దతును సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాల వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జంపాని కుమార్

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- పొలాల్లో బోల్తాపడిన ఆటో
- దానిని తీసేందుకు సాయం వెళ్లి మృత్యువాత
- దగదర్తి మండలం తడకలూరులో ఘటన

దగదర్తి (బిట్రగుంట): దగదర్తి మండలం తడకలూరులో విద్యుదాఘాతంతో ఇద్దరు గిరిజనులు మంగళవారం మృత్యువాత పడ్డారు. ప్రమాదవశాత్తు అదుపుతప్పి పంట పొలాల్లో బోల్తాపడిన ఆటోను పైకి తీసేందుకు సాయంగా వెళ్లిన గిరిజనులు దాసరి పోలయ్య (46), మాణికల నరసయ్య (21) కరెంట్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందటంతో మృతుల కుటుంబాలు గుండెలవిసేలా రోదిస్తున్నాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు తడకలూరుకు చెందిన మనోహర్, మహాలక్ష్మమ్మలు గేదెలకు అవసరమైన పచ్చిగడ్డి కోసం ఆటోలో తలమంచి మేజర్ కాలువ జీప్‌ట్రాక్‌పైన ఆటోలో వెళుతుండగా ఆటో ప్రమాదానికి గురైంది. జీప్‌ట్రాక్‌పైన ఉన్న గోతుల కారణంగా ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. ఆ సమయంలోనే మనోహర్, మహాలక్ష్మమ్మలు ఆటోలో నుంచి బయటకు దూకేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పొలాల్లో బోల్తా పడిన ఆటోను పైకి తీసుకు వచ్చేందుకు స్థానిక గిరిజనులను సాయం కోరగా తడకలూరు గిరిజన కాలనీకి చెందిన దాసరి పోలయ్య, మాణికల నరసయ్యలు వచ్చారు. ఆటో బోల్తా పడే సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తెగి ఆటోపైన పడిన విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. దీంతో ఆటోను పైకి తీసేందుకు ప్రయత్నించిన పోలయ్య, నరసయ్యలు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబాలు సంఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదిస్తున్నాయి. పోలయ్యకు భార్య నలుగురు పిల్లలు ఉండగా, నరసయ్యకు ఇంకా వివాహం కాలేదని తెలిసింది. దగదర్తి ఎస్సై జంపాని కుమార్, ట్రాన్స్‌కో ఏఈ దస్తగిరి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

రెడ్‌క్రాస్‌లో ఐదుగురు ఎంసీ మెంబర్ల తొలగింపు?

• రాజకీయ ఒత్తిళ్లతోనే..

నెల్లూరు(అర్బన్‌): సేవకు మరోపేరుగా మారిన ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ జిల్లా కమిటీలో అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లు పనిచేసినట్టు తెలుస్తోంది. రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటున్నారనే సాకును చూపి ఇటీవల జిల్లా చైర్మన్‌ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీ మెంబర్లు మలిరెడ్డి కోటారెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడులకు రెడ్‌క్రాస్‌ అధ్యక్షుడైన కలెక్టర్‌ ఆనంద్‌ నోటీసులిచ్చారు. ఈనెల 15వ తేదీలోగా వివరణ ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్‌ మంగళవారం రాత్రి ఆ ఐదుగురిని రెడ్‌క్రాస్‌ మేనేజింగ్‌ కమిటీ మెంబర్లుగా తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. విమర్శలకు తావివ్వకూడదని గతంలోనే చంద్రశేఖర్‌రెడ్డి తన చైర్మన్‌ పదవికి రాజీనామా చేసి ఎంసీ మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆయన్ను తొలగించే క్రమంలో మిగిలిన వారిని కూడా తీసేసినట్టు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ ఒత్తిళ్లతోనే ఆగమేఘాలపై చర్యలు తీసుకున్నారంటూ తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఒక ఎంసీ మెంబర్‌ చట్టబద్ధంగా ఎన్నికల్లో పాల్గొని గెలిచిన తనను తొలగించే అధికారం లేదంటూ కోర్టుకెళ్లినట్టు సమాచారం. దేశంలోనే ఎంతో పేరు తెచ్చుకున్న జిల్లా రెడ్‌క్రాస్‌ సంస్థను నిర్వీర్యం చేసేందుకు అధికార పార్టీ అనవసర రాజకీయాలు చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యువతి అదృశ్యం

సంగం: మండలంలోని వంగల్లుకు చెందిన ఓ యువతి అదృశ్యమైందని బాధిత తల్లిదండ్రులు మంగళవారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటర్మీడియట్‌ చదివిన ఆమె ఇంటి వద్ద ఉంటోంది. సోమవారం నుంచి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగం ఎస్సై రాజేష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులకు అప్పగింత



విశాల్‌ను అప్పగించిన పోలీసులు

అనుమసముద్రంపేట(ఆత్మకూరు): మహారాష్ట్రకు చెందిన ఓ యువకుడు తప్పిపోగా పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మంగళవారం ఏఎస్‌పేట ఎస్సై సైదులు వివరాలు వెల్లడించారు. విశాల్‌ పరమేశ్వర్‌కు మతిస్థిమితం లేదు. అతడిని కుటుంబసభ్యులు వారంరోజుల క్రితం దర్గాకు తీసుకొచ్చారు. ఈ సమయంలో విశాల్‌ తప్పించుకుపోయాడు. దీంతో కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్సై భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుల్‌ షబ్బీర్‌లను ఎస్సై బృందంగా ఏర్పాటు చేసి వెతికించారు. విశాల్‌ ఆత్మకూరు పట్టణంలో తిరుగుతుండగా మంగళవారం గుర్తించి ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధిత కుటుంబసభ్యులను పిలిపించి ఆ యువకుడిని వారికి అప్పగించారు.

ఈనెలాఖరు వరకు పశు ఆరోగ్య శిబిరాలు

నెల్లూరు(సెంట్రల్‌): నెల్లూరు అర్బన్‌ పరిధిలో ఈనెల 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్‌ టి.సోమయ్య తెలిపారు. మంగళవారం నెల్లూరులో శిబిరాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వెటర్నరీ, పాలిక్లినిక్‌ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులను కోరారు.

80 ఎకరాల్లో ప్రాంతీయ విద్యా కేంద్రం

• 2016లో కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్‌
• వెంకటాచలం మండలం చవటపాళెంలో భూముల కేటాయింపు
• రూ.500 కోట్లను మంజూరు చేసిన కేంద్రం
• ఈ నెలాఖరులో భవన నిర్మాణ పనులు ప్రారంభం
• 2025 – 26 నుంచి పూర్తిస్థాయిలో కోర్సులు మొదలు



వీఆర్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ విద్యా కేంద్రం

నెల్లూరు(టౌన్‌): ఎన్సీఈఆర్టీ (నేషనల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఎడ్యుకేషనల్‌ రీసెర్చ్‌ అండ్‌ ట్రైనింగ్‌) ఆధ్వర్యంలో ప్రాంతీయ విద్యా కేంద్రాన్ని జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి కేంద్రం దక్షిణ భారతదేశంలో మైసూరులో మాత్రమే ఉంది. వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ప్రాంతీయ విద్యా కేంద్రాన్ని నెల్లూరులో ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖ 2016లో గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. దీనికి సంబంధించి వెంకటాచలం మండలం చవటపాళెం సమీపంలో 80 ఎకరాలను కేటాయించారు. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వం భూముల యజమానులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేసింది. దీంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన తయారయ్యాయి. రైతులకు పరిహారం చెల్లించడంతో భవన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. ఈ నెలాఖరులో పనులను ప్రారంభించనున్నట్లు ఇటీవల నెల్లూరుకు వచ్చిన ఎన్సీఈఆర్టీ డైరెక్టర్‌ ప్రకటించారు.

రూ.500 కోట్లతో నిర్మాణం

జాతీయ పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో ప్రాంతీయ విద్యా కేంద్రం ఏర్పాటుకు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణాన్ని రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలని గడువు విధించింది. ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షదీప్‌ విద్యార్థులు ఈ కేంద్రంలో చదువుకునే వెసులుబాటు కల్పించారు. 80 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఈ కేంద్రంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించనున్నారు. తరగతి గదులు, కంప్యూటర్‌ ల్యాబ్‌, హాస్టల్‌ వసతి, క్రీడా మైదానం తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా జాతీయ పాఠ్య ప్రణాళికను రూపొందించి అందుకనుగుణంగా పుస్తకాలను తయారు చేసి అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నారు.

తాత్కాలికంగా..

నెల్లూరు నగరంలోని వీఆర్‌ డిగ్రీ కళాశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి తాత్కాలికంగా తరగతులను నిర్వహిస్తున్నారు. మొత్తం 20 గదులను ఏర్పాటు చేశారు. మరమ్మతులు, పరికరాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.55 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఎంఏ ఎడ్యుకేషన్‌ టెక్నాలజీ కోర్సును నిర్వహిస్తున్నారు. ఒడిశా, జార్ఖండ్‌, బిహార్‌, మణిపూర్‌ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ కోర్సును అభ్యసిస్తున్నారు. వీరికి గొలగమూడిలోని ఐఐటీఎంలో హాస్టల్‌, భోజన వసతిని కల్పించారు. 2025 – 26 విద్యా సంవత్సరంలో నాలుగేళ్ల కోర్సులతో బీఎస్సీ ఎడ్యుకేషన్‌, బీఏ ఎడ్యుకేషన్‌, రెండేళ్ల కోర్సుతో బీఈడీ, ఎంఈడీలను ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా డెమాన్‌స్ట్రేషన్‌ మల్టీపర్పస్‌ స్కూల్‌ ఏర్పాటు చేసి బాల వాటిక పేరుతో 1, 2, 3 తరగతులను నిర్వహించనున్నారు. ప్రాథమిక, హైస్కూల్‌ స్థాయిలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఎన్సీఈఆర్టీలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా ప్రాథమిక స్థాయి నుంచే వారికి ప్రత్యేక పద్ధతిలో బోధన చేసే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

పూర్తిస్థాయిలో కోర్సులు ప్రారంభిస్తాం



ప్రాంతీయ విద్యా కేంద్ర నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని గడువు విధించారు. కంప్యూటర్‌, సైకాలజీ తదితర ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా వీఆర్‌ డిగ్రీ కళాశాలలో తరగతులు ఏర్పాటు చేశాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో కోర్సులను ప్రారంభించనున్నాం. ఇటీవల తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని డైట్‌ అధ్యాపకులకు కెపాసిటీ బిల్డింగ్‌ ప్రోగ్రాంపై రెండురోజులపాటు ఓరియంటేషన్‌ ప్రోగ్రాంను నిర్వహించాం. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటాం.
– ప్రొఫెసర్‌ రమేష్‌, ప్రిన్సిపల్‌, ఎన్సీఈఆర్టీ

ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్ల ఎంపిక



వలంటీర్లను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26 తేదీన దేశ రాజధానిలో జరిగే కార్యక్రమాలను వీక్షించేందుకు విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు ఎంపికైనట్లు ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. ఎంపికైన బి.యుగంధర్‌ (బయోటెక్నాలజీ విభాగం), షాలిని ప్రియా (కెమిస్ట్రీ విభాగం)ను ఆయన మంగళవారం వర్సిటీలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు గణతంత్ర దినోత్సవ పరేడ్‌, సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే వివిధ ప్రదర్శనలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని పొందారని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కె.సునీత, ఎన్‌ఎస్‌ఎస్‌ కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ ఉదయ్‌శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ (లైవ్‌)	: 134
లేయర్‌ (లైవ్‌)	: 88
బ్రాయిలర్‌ చికెన్‌	: 240
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 264
లేయర్‌ చికెన్‌	: 150



దైవ దర్శనానికి వెళ్తూ..

• రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
• మరొకరికి తీవ్ర గాయాలు



రత్తయ్య మృతదేహం



గాయపడిన వెంగయ్య

ఉదయగిరి: దుత్తలూరు మండలం వెంకటంపేటలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం మోటార్‌బైక్‌పై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. ఉదయగిరి మండలం సున్నంవారిచింతల గ్రామానికి చెందిన గోగుల రత్తయ్య (40)కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం అతను కొన్నినెలల క్రితం భార్యతో కలిసి బెంగళూరుకు వెళ్లాడు. ఇద్దరూ అక్కడ బేల్దారి పనులు చేస్తున్నారు. వారి చిన్న కుమార్తె సీతారామపురంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతోంది. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో రత్తయ్య తన కుమార్తెను బెంగళూరుకు తీసుకెళ్లాడు. సెలవులు పూర్తికావడంతో కుమార్తెను తీసుకుని స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో వెంకటంపేటలోని ఆంజనేయ స్వామిని దర్శించుకుని, కుమార్తెను పాఠశాలలో విడిపించి రాత్రికి బెంగళూరు బయలుదేరాలని రత్తయ్య అనుకున్నాడు. మంగళవారం ఉదయం తన మామ మంచాల వెంగయ్యతో కలిసి దైవ దర్శనానికి బైక్‌పై బయలుదేరాడు. ఇంటికి కొద్దిదూరంలోని గానుగపెంటపల్లి గ్రామం వద్ద ఉన్న రోడ్డు మలుపు వద్ద వేగంగా వెళ్తుండగా బైక్‌ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న పెద్ద రాయిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రత్తయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మృతిచెందాడు. వెంగయ్యకు స్థానిక వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి పెద్ద మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. సున్నంవారిచింతలలో విషాదం నెలకొంది.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

• జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషా

ఉదయగిరి: జిల్లాలో అటవీ సోషల్‌ ఫారెస్ట్‌ల ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి ఎస్‌కే మహబూబ్‌బాషా పేర్కొన్నారు. ఇప్పటికే పలు నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఉదయగిరి రేంజ్‌ పరిధిలోని దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో మంగళవారం ఆయన పలు నర్సరీలు, ప్లాంటేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో 19 లక్షలు, సోషల్‌ ఫారెస్ట్‌ ఆధ్వర్యంలో 40 లక్షల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నట్లుగా తెలిపారు. జిల్లాలో వన సంరక్షణ సమితుల్లో పెంచిన జామాయిల్‌ కర్రను త్వరలో కటింగ్‌ చేయిస్తామని చెప్పారు. ఇటీవల నిర్వహించిన టెండర్లలో జేకే పేపర్‌ మిల్స్‌, రాయిజెడ్‌ సంస్థ టన్ను రూ.8,100ల చొప్పున టెండర్లు చేజిక్కించుకున్నాయన్నారు. ఇప్పటికే అగ్రిమెంట్‌ పూర్తయిందన్నారు. సుమారు 78 వేల మెట్రిక్‌ టన్నుల జామాయిల్‌ కర్ర దిగుబడి రావొచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఇందులో 50 శాతం వీఎస్‌ఎస్‌లకు అందించి ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఉదయగిరి రేంజ్‌ అధికారి బీఎస్‌ కుమారరాజా, డీఆర్వో మురళి, సిబ్బంది ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

విడవలూరు: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వారి కథనం మేరకు.. మండలంలోని పార్లపల్లి గ్రామంలో నివాసముంటున్న ముక్కు సాయితులసి (37) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం పురుగు మందు తాగింది. గుర్తించిన భర్త రమేష్‌, బంధువుల వెంటనే ఆమెను నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది. దీనిపై విడవలూరు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై నరేష్‌ కేసు నమోదు చేశారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

అక్రమ మైనింగ్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి తిప్ప సర్వే నంబర్‌ 707లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా మైనింగ్‌ చేస్తున్నారని పొదలకూరు బిట్‌ – 4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు మంగళవారం తహసీల్దార్‌ బి.శివకృష్ణయ్యకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొండ వద్ద తెల్లరాయిని వెలికి తీస్తున్నట్టు వెల్లడించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్‌ ఎస్సై హనీఫ్‌కు సమాచారం అందించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

కేసు నమోదు

పోలీసులు వీఆర్వో సహకారంతో మైనింగ్‌ వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎస్సై అక్రమ మైనింగ్‌ చేస్తున్న ప్రాంతానికి వెళ్లి పొక్లెయిన్‌ను సీజ్‌ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.


గీత కార్మికులకు 18 మద్యం దుకాణాలు

• స్పష్టత లేని జీఓ

నెల్లూరు(క్రైమ్‌): గీత కార్మికులకు మద్యం షాపులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జారీ చేసిన జీఓ అస్పష్టంగా ఉంది. జిల్లాకు మరో 18 మద్యం దుకాణాలని జీఓలో పేర్కొన్నారు. కాగా ఉపకులాల వారీగా కేటాయింపులు పోగా మిగిలిన ఒకటి ఏ కులానికి కేటాయించారన్న దానిని ఎక్కడా పొందుపరచలేదు. ఈ విషయాన్ని జిల్లా ఎక్సైజ్‌ అధికారులు ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక జనాభా ప్రాతిపదికన ఏ మండలానికి ఎన్ని షాపులన్న వివరాలతో కలెక్టర్‌ గెజిట్‌ విడుదల చేసిన అనంతరం దరఖాస్తుల స్వీకరణ, లాటరీ పద్ధతితో కేటాయింపు జరుగుతుంది. రెండేళ్ల కాలపరిమితితో లైసెన్స్‌లు జారీ చేస్తారు. ఈ షాపులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ కుల, నివాస ధ్రువీకరణపత్రాలు సమర్పించాలి. ఒక షాపునకు (దరఖాస్తు) నాన్‌ రీఫండబుల్‌ ఫీజును రూ.2 లక్షలుగా నిర్ణయించారు. కార్మికులు జిల్లాలోని అన్నింటికి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఒక అభ్యర్థికి ఒక షాపు మాత్రమే కేటాయించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే సిండికేట్‌గా మారిన వ్యాపారులు గీత కులాలకు కేటాయించిన దుకాణాలను సైతం దక్కించుకునేందుకు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.35
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.15



‘గండిపాళెం’ నిర్వహణ గాలికి..

ఎడమ కాలువ ఇలా..




కుడి కాలువ దుస్థితి



జలాశయానికి పొంచి ఉన్న ప్రమాదం

• నిర్వహణకు నిధులు నిల్‌
• దుస్థితిలో ప్రధాన కాలువలు



గండిపాళెం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ

ఉదయగిరి: రైతులకు ఉపయోగపడే పనులను చేయించే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఉదయగిరి మెట్ట ప్రాంత అన్నదాతలకు వరప్రదాయినిగా ఉన్న గండిపాళెం జలాశయం నిర్వహణ అధ్వానంగా మారింది. ఈ ప్రాజెక్ట్‌ కింద ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో 16 వేల ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్‌లో 21 అడుగులు మేర నీరు చేరింది. ప్రధాన కాలువలతోపాటు బ్రాంచ్‌ కాలువలు దుస్థితిలో ఉండటంతో ఆయకట్టు పారుదల ప్రశ్నార్థకంగా మారింది. కాలువల మరమ్మతులకు, పూడికతీతకు ఈ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. అంతేకాకుండా జలాశయం ప్రధాన కట్టపై పెరిగిన చిల్ల చెట్లు, పిచ్చిమొక్కలతో ప్రమాదం పొంచి ఉంది. గేట్లు మరమ్మతులకు గురికావడంతో నీరు లీకై వృథాగా పోతోంది. వీటి మరమ్మతులకు గత ప్రభుత్వంలో నిధుల మంజూరయ్యాయి. రెండు నెలల క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కానీ ఇంత వరకు పనులు చేపట్టలేదు. అనేక సమస్యలతో కునారిల్లుతున్న ఈ ప్రాజెక్ట్‌ అభివృద్ధిపై సాగునీటి కమిటీ సభ్యులు దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

గండిపాళెం జలాశయానికి సంబంధించి వివిధ పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం
– చంద్రమౌళి, డీఈ